సాక్షి
జనగామ

శుక్రవారం । 22 మార్చి । 2024



చీట్‌ఫండ్..
ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్‌ఫండ్ నిర్వాహకులు దారిమళ్లిస్తున్నారు. పొదుపు చేసుకుంటున్న సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. - 8లో▸



గురుకులంలో ఫుడ్ పాయిజన్!
జనగామ మండలం పెంబర్తి శివారులోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు భోజనం చేసిన అనంతరం అస్వస్థతకు గురయ్యారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
38°/21°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.



నిఘా కట్టుదిట్టం

- రాజకీయ పార్టీల కదలికలపై ఆరా
- ఎన్నికల నేపథ్యంలో ఆరు బృందాల ఏర్పాటు
- రంగంలోకి యాక్షన్ టీంలు


పెంబర్తి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్

జనగామ: ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి అధికారులు రాజకీయ పార్టీల కదలికలపై నిఘా ఉంచారు. పార్టీ ప్రచార ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్, బోర్డులతో పాటు ఇతర జెండాలను తొలగించారు. పార్టీల జెండా గద్దెలకు తెల్ల రంగు వేశారు. జిల్లావ్యాప్తంగా ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా బహుమతుల తరలింపుపై 24 గంటల పాటు తనిఖీలు చేస్తున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, సీఆర్‌పీఎఫ్ బలగాలు జిల్లాకు రాగా.. మరో రెండు కంపెనీల ఫోర్స్ సిబ్బంది ఒకట్రెండు రోజుల్లో రానున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో.. అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్ నేతృత్వంలో.. లోకల్ కేబుల్, ఛానల్స్, జిల్లా పత్రికల సమాచారం, గ్రీవెన్స్ కమిటీ, సోషల్ మీడియా మానిటరింగ్, ఎంసీఎంసీ, సీ విజిల్, 1950 కాల్ సెంటర్ ఇలా.. ఆరు టీంలను ఏర్పాటు చేశారు. కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా వేస్తున్నారు. జిల్లాలో పార్టీల ప్రచార పర్వం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. ఈనేపథ్యంలో.. ఎలక్షన్ టీంలు సైతం వారి కదలికలపై ఆరా తీస్తున్నాయి.

గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు..
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. జిల్లాలో గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. పోలీసులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు జప్తు చేసిన నగదు, ఇతర వస్తువులకు సంబంధించి గ్రీవెన్స్ కమిటీ కేసును సుమోటాగా స్వీకరించి పరిశీలన చేస్తారు. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు పట్టుబడితే ఈ కమిటీ నేతృత్వంలో విచారణ జరిపి, సరైన ఆధారాలుంటే తిరిగి అప్పగిస్తారు. తనిఖీల్లో రూ.10 లక్షలకు పైగా.. నగదు పట్టుబడితే ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తారు.

సోషల్‌మీడియా, ఎంసీఎంసీ. సీ–విజిల్ టీంలు
నకిలీ వార్తల ప్రచారం, ఇరువర్గాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించి ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఎన్నికల్ని స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూస్తూ.. సమస్యను డీఈఓ స్థాయిలో పరిష్కరిస్తారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. సీ–విజిల్ యాప్‌లో వచ్చే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఫిర్యాదులకు సంబంధించి ఉల్లంఘన కేసుల మానిటరింగ్ కోసం కమిటీ ఏర్పాటు చేశారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే పౌరులు ఫొటో లేదా వీడియోను సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపించవచ్చు. ఫిర్యాదు అందుకున్న అధికారులు, వెంటనే లోకేషన్‌కు చేరుకుంటారు.

టోల్ ఫ్రీ నంబర్..
ఎన్నికలు ముగిసే వరకు 24 గంటల పాటు కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ 1950కు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను రికార్డు చేస్తారు. ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత ఏఆర్ఓ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలకు పంపిస్తారు. ఫిర్యాదులపై చర్యలు తీసుకున్న తర్వాత నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు


ఘన్‌పూర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ రూరల్/స్టేషన్ ఘన్‌పూర్: జిల్లా వ్యాప్తంగా 41 సెంటర్లలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 6,698 మంది విద్యార్థులకు గాను 6,691 మంది హాజరైనట్లు డీఈఓ రాము అన్నారు. మొత్తం 99.90 శాతం మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. డీఈఓ రాము జిల్లాలోని ఏడు సెంటర్లను సందర్శించి తగు సూచనలను చేశారు. పరీక్షల నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండి సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని పల్లగుట్ట సోషల్ వెల్ఫేర్ పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జెడ్పీఎస్ఎస్ ఘన్‌పూర్, ప్రభుత్వ మోడల్ స్కూల్ సెంటర్లను ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ..
నర్మెట: స్థానిక తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్ కార్యాలయంలో ధరణి అనుబంధ రికార్డులను పరిశీలించి తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఆర్ఐ సాయిబాబా, ఆపరేటర్ రాజుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీఓ ఎండీ ఖాజా మొహిఉద్దీన్, ఎంపీఓ అరవింద్ చౌదరికి సూచనలు చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ రూరల్: పార్లమెంట్ ఎన్నికల విధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పనుల నివేదికలను రోజువారీగా అందించాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంసీసీ, సోషల్ మీడియా, కంట్రోల్ రూమ్, నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పింకేశ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గానికి 3 ఫ్లైయింగ్ సర్వే లెన్స్, 3 స్టాటిస్టికల్ సర్వే లెన్స్, 3 వీడియో సర్వే లెన్స్ చొప్పున 3 నియోజకవర్గాలకు 27 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలకు జీపీఎస్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్, ఈడీఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగు జయప్రకాశ్, వ్యాయామ ఉపాధ్యాయులు కొండ రవి తెలిపారు. పాఠశాలకు చెందిన 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులు మంద జశ్వంత్, లకావత్ చరణ్, మల్లం రోహిత్, అడెపు కమల్, మారపాక వివేక్, వంగ మనోజ్, సిరికొండ హరీశ్, మునిగాల శశిధర్ లకావత్ అఖిల్, భూక్య మహేశ్ ఇటీవల జనగామ పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్‌లో తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు వారు పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. మరింత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు కోరారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించండి



జనగామ రూరల్: బీజేపీని ఓడించాలని, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల బరిలో సీపీఎం పోటీలో ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జోగు ప్రకాశ్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, విజేందర్, వెంకట మల్లయ్య, రజిత, అజారుద్దీన్, రమాదేవి, లక్ష్మీ, సునీత, సంపత్ మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ విచారణ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి గురువారం సందర్శించారు. కార్యాలయంలో.. రిజిస్టర్లు, ఫైళ్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని నీల యాదలక్ష్మి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంటి నిర్మాణంపై కటకం బుచ్చిలింగం 2016లో హైకోర్టులో పిటిషన్ వేశారని, అతడి ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో విచారణకు వచ్చినట్లు తెలిపారు. ఇందుకు సంబంధిత పూర్తి పత్రాలతో రావాలని వెంకటేశ్వర్లుకు సూచించామని, విచారణ చేపట్టి నివేదికను అధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్పీఓ వెంకటప్రసాద్, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టు దిగుతుండగా జారిన మోకు



సంగెం: తాటి చెట్టుపై ప్రమాదవశాత్తు మోకు జారి వెల్లకిలా పడిపోయిన గీత కార్మికుడిని తోటి గీత కార్మికులు జేసీబీతో రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొండ్రాయి గ్రామానికి చెందిన బాల్నే పోశాలు బుధవారం రాత్రి కల్లుగీసేందుకు తాటి చెట్టు ఎక్కి కిందికి దిగుతున్నాడు. ఈ సమయంలో మోకు జారి వెల్లకిలా తాటి చెట్టుపై వేలాడాడు. అతడి అరుపులు విన్న కుమారుడు మురళి, తోటి గీతకార్మికులు వేముల వెంకటేష్, మడత శ్రీనివాస్ హుటాహుటిన తాటిచెట్టు ఎక్కి కాపాడే ప్రయత్నం చేశారు. ఇంతలో కొందరు జేసీబీని తెప్పించి దాని సాయంతో పోశాలును కిందకు దించారు. పోశాలు క్షేమంగా కిందకు దించడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్

జనగామ: జిల్లాలోని ఎంసీహెచ్‌తో పాటు సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో వందశాతం సాధారణ ప్రసవాలు చేయాలని జిల్లా వైద్యాధికారి, హరీశ్‌రాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జాతీయ సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మహేందర్, ప్రోగ్రాం ఆఫీసర్లు, రవీందర్‌గౌడ్, డాక్టర్ సుధీర్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో రాష్ట్రంలోనే జనగామ 4వ స్థానంలో ఉందని, ఇందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని తాగునీటి నిర్వహణ, కాలుష్యం, సంరక్షణపై అవగాహన కల్పించారు. నీటి ఆవశ్యకతపై శుక్రవారం నుంచి ప్రజల్లో మరింత అవేర్నెస్ పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్లు కరుణాకర్‌రాజు, శ్రీదేవి, సామాజిక ఆరోగ్య కార్యకర్తల రెహమాన్ తదితరులున్నారు.

ఒక్కో పదవికి రెండు దరఖాస్తులు

- జాయింట్ సెక్రటరీ కోశాధికారి, ఇతర సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక

జనగామ రూరల్: జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికకు ఒక్కో పదవికి రెండేసి దరఖాస్తులు వచ్చినట్లు చీఫ్ ఎన్నికల అధికారి శ్రీరాం శ్రీనివాస్, అసిస్టెంట్ అధికారులు పి.రామకృష్ణ, ఆకుల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవికి డి.హరిప్రసాద్, వై.చంద్రరుషి, ఉపాధ్యక్ష పదవికి ఎన్‌బీ.కిషన్, కె.రాంరెడ్డి, జనరల్ సెక్రటరీకి ఎన్.సిద్ధులు, ఎన్.రేణుక ఇద్దరు పోటీ పడుతున్నట్లు పేర్కొన్నారు. కమిటీ జాయింట్ సెక్రటరీగా మానే సత్తయ్య, కోశాధికారిగా సీహెచ్.చంద్రశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.మురళి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఇ.జ్యోష్న, కె.దాసు, ఇ.ఉదయ్, జే.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అధ్యక్ష కార్యదర్శి ఎన్నికలు ఈనెల 28న ఉంటాయని వారు పేర్కొన్నారు.

మహిళలు మనోధైర్యంతో ఉండాలి

- జిల్లా సంక్షేమాధికారి జయంతి


మహిళలను సన్మానిస్తున్న జిల్లా సంక్షేమాధికారి

జనగామ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ.. ఆటంకాలు ఎదురైతే మనోధైర్యంతో ఉండాలని జిల్లా సంక్షేమాధికారి జయంతి అన్నారు. గురువారం మండలంలోని వడ్లకొండలో శ్రీకల్ప సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో.. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిభ కనబర్చిన ఆయా రంగాల.. మహిళలను సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు అలేటి కల్పలత తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లోనే భోజనం చేయాలి
లింగాలఘణపురం: గర్భిణులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలని డీడబ్ల్యూఓ జయంతి అన్నారు. మండలంలోని రైతు వేదిక భవనంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను టైం టేబుల్ ప్రకారం బోధించాలని.. అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, వైద్యాధికారి కరుణాకర్, ఎంపీఓ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



రఘునాథపల్లి: మండలకేంద్రానికి చెందిన కొత్తూరు కార్తీక్ (28) ఆర్థిక ఇబ్బందులతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కార్తీక్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఖర్చులు పెరిగి, పనులు దొరకకపోవడంతో కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు.

కోర్టు ఏర్పాటుకు భవన పరిశీలన


కోర్టు భవనంలో గదులు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి రవీందర్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం భవనాన్ని జిల్లా జడ్జి రవీందర్‌శర్మ గురువారం పరిశీలించారు. ఘన్‌పూర్ బస్టాండ్ సమీపంలోని ఎస్సీ బాలుర వసతిగృహం దాదాపు ఆరేళ్లుగా మూతపడి ఉండగా.. ఆభవనాన్ని తాత్కాలికంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు కేటాయించారు. కాగా.. భవనాన్ని జిల్లా జడ్జి గురువారం సాయంత్రం పరిశీలించారు. రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భవనంలోని అన్ని గదుల పరిస్థితిని చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవనంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులు పరిశీలించామని, అదనపు నిధుల కోసం ఎస్టిమేషన్ వేసి పంపాలని ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేయించి కోర్టును ప్రారంభించనున్నట్లు ఇక్కడ కోర్టు ఏర్పాటైతే డివిజన్ పరిధి స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు, పాలకుర్తి, కొడకండ్ల ప్రజలకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, సీఐ ముస్క రాజు, ఎస్ఐ వినయ్, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ దుస్స జనార్దన్, బార్ అసోసియేషన్ ఘన్‌పూర్ అధ్యక్షుడు కనకం రమేశ్, ప్రధాన కార్యదర్శి పిల్లి కార్తీక్, కోశాధికారి జి.అనిల్, నీరటి కార్తీక్, కమలాకర్ తదితరులున్నారు.

రిజర్వాయర్ పనుల పరిశీలన


నివేదికను పరిశీలిస్తున్న ధీరజ్

పాలకుర్తి: పాలకుర్తి మండలంలో జరుగుతున్న చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ పనులను సెంట్రల్ వాటర్ కమిషన్ న్యూఢిల్లీ బృందం డిప్యూటీ డైరెక్టర్ పీడబ్ల్యూసీ ధీరజ్ పరిశీలించారు. గురువారం రెండు రిజర్వాయర్లలో జరిగిన పనుల తీరును పరిశీలించి నివేదిక తయారు చేశారు. ఈసందర్భంగా ధీరజ్ మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. ఏడాదిలోగానే రెండు రిజర్వాయర్ పనులు పూర్తి చేయనున్నట్లు, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతాంగానికి నీటి వసతి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీకాంత్ శర్మ, ఏఈఈ శశిధర్, పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

టవర్ ఎక్కిన కాంగ్రెస్ కార్యకర్త

- పాత అధ్యక్షుడినే కొనసాగించాలని డిమాండ్


టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న బాబు,


బాబు (బ్లూ లైన్స్ షర్ట్)

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తిని పార్టీ నుంచి అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ.. మండల కేంద్రానికి చెందిన కార్యకర్త ఉప్పుల బాబు గురువారం ఆత్మహత్య చేసుకుంటానని సెల్ టవర్ ఎక్కాడు. రెండ్రోజుల క్రితం పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో.. నల్ల శ్రీరాములును మండలాధ్యక్షుడిగా ప్రకటించారు. అసంతృప్తి చెందిన బాబు సెల్ టవర్ ఎక్కి ఆందోళన తెలిపాడు. సత్వరమే కొత్త ఎన్నిక రద్దు చేసి పాత అధ్యక్షుడిని కొనసాగించాలని లేకపోతే ఆత్మహత్యకు పాల్పడతానని బాబు భీష్మించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న అతడి తల్లిదండ్రులు కాంగ్రెస్ పెద్దలు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అతడిని దింపేందుకు యత్నించినా వినకపోవడంతో ఎస్సై ఎస్.చెన్నకేశవులు.. పెద్ది కృష్ణమూర్తికి ఫోన్ చేశారు. కృష్ణమూర్తి ఆందోళనకారుడితో మాట్లాడి భరోసా ఇవ్వడంతో అతడు టవర్ దిగాడు.

టైలర్ల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న గాలి తిరుపతి

బచ్చన్నపేట: వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న టైలర్ల సమస్యలను పరిష్కరించాలని టైలర్ల సంఘం జేఏసీ రాష్ట్ర చైర్మన్ గాలి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి ఇప్పటి వరకు టైలర్ల సమస్యల గురించి పోరాడుతూనే ఉన్నామని, ప్రభుత్వాలు తమ సమస్యలపై చిన్న చూపు చూస్తున్నాయన్నారు. టైలర్లకు ఇందిరమ్మ ఇళ్లు, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు, వడ్డీ లేని బ్యాంకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. రెడీమేడ్ దుస్తులు వచ్చిన తర్వాత టైలర్ల గిరాకీ దెబ్బతిన్నదని పాఠశాల యూనిఫామ్‌లు కుట్టే అవకాశాన్ని అన్ని గ్రామాల టైలర్లకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టైలర్లు రాపెల్లి జనార్దన్, గంధమల్ల నర్సింహులు, సుధాకర్, నర్సింగారావు, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ఎదుర్కోళ్లు



చిల్పూరు: చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఘనంగా ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ మామిడాల యాదవరెడ్డి–జానకి, ఆలయ శాశ్వత దాతలు పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, సంగోజు మోహనాచారి–శంకర్‌లక్ష్మి ఆధ్వర్యంలో.. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, సముద్రాల కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ ఎదుర్కోళ్లు నిర్వహించారు. ధర్మకర్తలు గట్టు ఎల్లయ్య, మేకల మల్లేశం, పుల్యాల నారాయణరెడ్డి, పుట్ట కిరణ్‌రెడ్డి, జక్కుల రాజశేఖర్, గాజుల రజని, పెద్ది నారాయణ, కనకం మధు, బాలరాజు, సత్యనారాయణ, వికాస్‌రెడ్డి, ఉప్పరి గణేశ్ పాల్గొన్నారు.

చెక్ పోస్టుల తనిఖీ



బచ్చన్నపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని గోపాల్‌నగర్‌లోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనీశ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వాహనాన్ని ఆపి తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు బీబీ శంకర్, కంకల సతీశ్‌కుమార్, కానిస్టేబుళ్లు, సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'యశోద'లో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ

● డాక్టర్ సునీల్ దాచేపల్లి



రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ గురించి వివరిస్తున్న డాక్టర్ సునీల్

హన్మకొండ చౌరస్తా: హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ కీహోల్ సర్జరీలు ఇప్పటి వరకు 400లకు పైగా విజయవంతంగా చేశానని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. హనుమకొండలోని అశోకా హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లండన్‌లో పదేళ్ల ప్రత్యేక శిక్షణ పొంది 2014 నుంచి భారత్‌లో సర్జరీలు చేస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి యూకేలోని వైటింగ్‌టన్ హాస్పిటల్ యాజమాన్యం బంగారు పతకంతో సన్మానించిందన్నారు. చాలా మందిలో మోకాళ్ల అరుగుదల సాధారణంగా మారిందని, నొప్పులను భరించలేక కొందరు ఇంజక్షన్ వేసుకుని వదిలేస్తున్నారని, తప్పనిసరిగా సర్జరీ చేసుకోవాలని సూచించారు. రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్లలో పరికరాలను కచ్చిత పద్ధతిలో అమర్చొచ్చన్నారు. ఈ సందర్భంగా సర్జరీ చేసుకున్న వృద్ధురాలితో మాట్లాడించారు.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

చిట్యాల: ఆటో బోల్తాపడి ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన గోపగాని శోభ, వసంత, పద్మ, సమ్మక్క ఆటోలో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో వెంకట్రావుపల్లి (సి) అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఓ చిన్నారి రోడ్డు దాటుతోంది. పాపను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారితో పాటు ఆటో డ్రైవర్ అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు.

చీట్‌ఫండ్..

ప్రజల సొమ్మును వెంచర్లలోకి దారిమళ్లిస్తున్న నిర్వాహకులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో కనుమరుగవుతున్న చిట్స్ బిజినెస్
- రూ. 100 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పడిపోయిన టర్నోవర్
- బోర్డు తిప్పేసిన 9 చిట్‌ఫండ్ కంపెనీలు.. అదే బాటలో మరికొన్ని..
- అధికారుల పర్యవేక్షణ కరువు.. పీఎస్ మెట్లు ఎక్కుతున్న బాధితులు



కాజీపేట అర్బన్ : భవిష్యత్ అవసరాల నిమిత్తం చిన్న మొత్తంలో ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్‌ఫండ్ నిర్వాహకులు దారిమళ్లిస్తున్నారు. చిట్‌ఫండ్ బిజినెస్‌లో లాభాలు రాకపోవడంతో ప్రజలకు కుచ్చుటోపి పెట్టి వారు నెలనెలా పొదుపు చేసుకుంటున్న సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సొమ్మును తిరిగి చెల్లించమని ఖరాఖండి చెబుతున్నారు. పైగా బలవంతంగా ప్లాట్ అంటగడుతున్నారు. ఒకవేలా వద్దంటే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు తమ నెలసరి ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేసి ఆర్థిక అవసరాలకు వినియోగించుకునేందుకు చిట్స్ వైపు ఆసక్తి కనబరుస్తారు. ఈ క్రమంలో ప్రైవేట్ చిట్స్‌తో తమ సొమ్ముకు భద్రత ఉండదని భావించి ప్రభుత్వం ఆమోదం పొందిన రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో దొందూదొందే అన్న చందంగా ప్రైవేట్ చిట్ యజమాని రాత్రికి రాత్రే ప్రజల సొమ్ముతో పరారీ అవుతుండగా.. ప్రభుత్వ ఆమోదం పొందిన చిట్ ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేసి చిట్ డబ్బులు ఇవ్వక ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఫలితంగా చిట్స్ కంపెనీలు చీటింగ్‌తో ఓ వైపు.. అధికారులు స్పందించకపోవడంతో మరో వైపు బాధితులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు..

వరంగల్ ఆర్వో కార్యాలయంలోని చిట్స్ సహాయ రిజిస్ట్రార్ బాధితులకు భరోసానివ్వకపోవడం.. చిట్ ఫండ్ కంపెనీలపై పర్యవేక్షణ కొనసాగించకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రీవెన్స్ మాదిరి జిల్లా రిజిస్ట్రార్‌కు ప్రతి సోమవారం పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయంటే చిట్స్ చీటింగ్ ఎలా ఉందో తెలుస్తోంది.

పీఎస్ మెట్లు ఎక్కుతున్న బాధితులు..

తమకు జవాబుదారీగా నిలుస్తారనుకున్న అధికారులతో విసిరివేసారిన చిట్స్ బాధితులు.. పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. ఇందులో భాగంగా గతంలో వరంగల్ పోలీస్ కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో చిట్‌ఫండ్ కంపెనీల యాజమాన్యంతో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సొమ్ము చెల్లించాలని తెలిపిన ఫలితం లేదు. పైగా తమ వెంచర్‌లో తక్కువ ధరకే ప్లాట్లు ఉన్నాయని, వీటిని తీసుకోవాలనే ఒత్తిడి మొదలైంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 262 బ్రాంచ్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 262 బ్రాంచ్‌లతో వివిధ రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు కొనసాగుతున్నాయి. వీటిలో 150కి పైగా సింగిల్ ఓనర్ అనగా బ్రాంచ్‌లు లేకుండా తమ చిట్స్ బిజినెస్ నడిపిస్తున్నాయి. కాగా రెండేళ్లుగా చిట్స్ కంపెనీలు తమ లావాదేవీలు నిలిపివేస్తూ వెంచర్‌లపై మక్కువ కనబరుస్తున్నాయి. దీంతో రాబోవు రోజుల్లో చిట్స్ కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు. గతంలో ప్రతి ఏడాది చిట్స్ కంపెనీల టర్నోవర్ రూ. 100 కోట్లపై బడి ఉండగా ప్రస్తుతం రూ. 15 కోట్లకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం.

బోర్డు తిప్పేసిన 9 కంపెనీలు.. ఎఫ్‌డీల ఫ్రీజ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే 9 చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేసి సభ్యులకు తమ సొమ్ము ఇవ్వకుండా చేతులు ఎత్తేశాయి. అదే బాటలో మరి కొన్ని కంపెనీలు పయనిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అక్షర, కనకదుర్గ, శుభనందిని, అచల వంటి కంపెనీల ఫిక్స్‌డ్ డిపాజిట్లను బ్యాంకుల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఫ్రీజ్ చేశారు. కాగా, ఫ్రీజ్ చేసిన సొమ్మును తమకు ఇవ్వాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా తమ సొమ్ము చెల్లించకపోవడంతో అక్షర చిట్ ఫండ్ ఖాతాదారులు ఆరు నెలల క్రితం సంఘం ఏర్పడ్డారు. అనంతరం చిట్‌ఫండ్ కంపెనీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు తమ స్థిరాస్తులు విక్రయించైనా ఇస్తామని చెప్పి నేటికీ చెల్లించలేదు. దీనిపై అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు.

రజాకార్ సినిమాను ఆదరించండి

- చిత్ర దర్శకుడు సత్యనారాయణ
- మానుకోటలో చిత్రయూనిట్ సందడి



మాట్లాడుతున్న నటి అనసూయ

మహబూబాబాద్ అర్బన్: రజాకార్.. మత, గత చరిత్ర, వివిధ పార్టీలకు సంబంధించిన సినిమా కాదని, తెలంగాణ చరిత్రకు సంబంధించిందని చిత్ర దర్శకుడు యాటా సత్యనారాయణ అన్నారు. గురువారం రజాకార్ చిత్ర విజయోత్సవ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని లక్ష్మి థియేటర్‌లో నిర్వహించగా చిత్రయూనిట్, నటీ, నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సత్యనారాయణ, సంగీత దర్శకుడు భీమ్స్ మాట్లాడుతూ.. మన తెలంగాణ చరిత్రను పట్టించుకోవాలని, గ్రూప్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఈ రజాకార్ సినిమా చూడాలని, ఇందులో నుంచి సుమారు 10 ప్రశ్నలు రావొచ్చన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ, ఖిలా వరంగల్, పరకాలలో మొదటి సారి జెండా ఎగరవేయడం వంటి కథనం, చరిత్ర ఆధారంగా ఈ సినిమాను చిత్రీకరించామని, దీనిని ఆదరించాలన్నారు. అనంతరం నటి అనసూయ మాట్లాడుతూ.. మానుకోట బిడ్డ భీమ్స్ రజాకార్ సినిమాకు మంచి సంగీతం అందించారని, ఈ సినిమాను తెలంగాణ ప్రజలందరూ ఆదరించాలన్నారు. తెలంగాణ బతుకమ్మ గురించి, మన సంప్రదాయాలకు అద్దంపట్టేలా సినిమా తీశామన్నారు. అనంతరం యూనిట్ సభ్యులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు రాజు అర్జున్, గూడూరు నారాయణ రెడ్డి, శ్రీగిరి, శివం, రమణ, బలగం సత్యనారాయణ,అంజిరెడ్డి, ప్రముఖ వైద్యులు వీరన్న, రంజిత్ రెడ్డి, లక్ష్మి థియేటర్ మేనేజర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: మండలకేంద్రంలో గురువారం 'రజాకార్' సినిమా యూనిట్ సందడి చేసింది. రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించి ప్రాణాలర్పించిన అమరుల చిహ్నంగా బయ్యారంలో నిర్మించిన అమరవీరుల స్తూపం వద్ద నివాళలర్పించింది. ఈ సందర్భంగా మండలవాసి, సినిమా సంగీత దర్శకుడు భీమ్స్‌సిసోడియా మాట్లాడారు. రజాకార్ సినిమాను ప్రతిఒక్కరూ చూడాలన్నారు. బయ్యారానికి చెందిన గాయకుడు, నటుడు వీరన్న చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు, కార్యక్రమంలో యూనిట్ సభ్యులు అనసూయ, శ్రీగిరి, శివం, రమణ, సత్యనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మందులు విక్రయిస్తున్న ఫార్మసిస్టు అరెస్టు

- రూ. 80,844 విలువైన ఔషధాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ ఔషధాలు

ఎంజీఎం : ప్రభుత్వ మందులు విక్రయిస్తున్న వరంగల్ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు నాగేందర్‌ను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు గురువారం డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్, ఇంతేజార్ గంజ్ పోలీసులు.. కాశిబుగ్గలోని నాగేందర్ ఇంటిని తనిఖీ చేశారు. ఈ సమయంలో ఇతర వ్యక్తికి ప్రభుత్వ మందులు అమ్ముతూ నాగేందర్ ప్రత్యక్షంగా పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. నాగేందర్ కొన్ని సంవత్సరాల నుంచి వైద్యుల ప్రిస్క్రిప్షన్ కంటే ఎక్కువ స్టాక్ చూపిస్తూ ఆస్పత్రిలో మందులు కాజేసి తనకు పరిచయమున్న బలరాందాసుకు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన బలరాం దాసు ప్రభుత్వ ఔషధాలను ఇతర మందుల షాపులకు విక్రయిస్తున్నాడు. ఈ దాడుల్లో రూ. 69,360 విలువైన అమాక్సిలిన్ పోటాషియం క్యాల్‌వెంట్, రూ.11,484 విలువైన ఐ డ్రాప్స్‌ను స్వాధీనం చేసుకుని డ్రగ్ కంట్రోల్ అధికారులు పంచనామా నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడీ రాజ్యలక్ష్మి, డ్రగ్ డీఐ కిరణ్, ఇంతేజార్ గంజ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగులకు విద్య అందకుండా కుట్ర

- భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ గోపీనాథ్



మాట్లాడుతున్న గోపీనాథ్

కేయూ క్యాంపస్: బడుగు, బలహీనవర్గాలకు విద్య అందకుండా పాలకవర్గాలు చేస్తున్న కుట్రే నూతన జాతీయ విద్యావిధానమని భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ అన్నారు. గురువారం కేయూలోని బాటనీ విభాగం సెమినార్ హాల్‌లో నూతన జాతీయ విద్యావిధానంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వేల ఏళ్లనాటి మనుస్మృతిని అమలు చేయడం కోసమే మనువాద పాలకులు ఈ నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు దీనిని వ్యతిరేకించాలన్నారు. రిటైర్డ్ ఆచార్యుడు మార్క శంకర్‌నారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగపు వెలుగులో నూతన జాతీయ విద్యా విధానం లేదని, హక్కులు ముచ్చట కరువైందన్నారు. సామాజిక న్యాయం అనే మాట అరవై ఆరు పేజీల ఎన్ఈపీ 2020లో లేదన్నారు. విద్యను ప్రైవేటు పరం చేసే దిశగానే వెళ్తుందన్నారు. అంతేగాకుండా అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే,పెరియార్‌లాంటి మహనీయుల ఆలోచన పరంపరలేదన్నారు. ఈ సదస్సుకు కేయూ విద్యార్థి నాయకుడు శ్రావణ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎం వెంగళ్‌రెడ్డి, మున్నా గణేష్, సత్యం,శివ, అనిల్ మాట్లాడారు. సామాజిక స్పృహతో కేయూ విద్యార్థులు నూతన జాతీయ విద్యావిధానం రద్దుచేయాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఈసదస్సు నిర్వహించినట్లు వారు తెలిపారు.

సీపీఈ సెమినార్‌లో వరంగల్ సీఏలు



ఐసీఏఐ అధ్యక్షుడు రంజిత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సీఏ పీవీ నారాయణరావు

వరంగల్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ ఎకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో బ్యాంక్ ఆడిట్స్‌పై హైదరాబాద్‌లో గురువారం సీపీఈ సెమినార్ నిర్వహించారు. ఒక్క రోజు నిర్వహించిన సెమినార్‌లో వరంగల్, కరీంనగర్‌కు చెందిన సీఏలు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో ఐసీఏఐ అధ్యక్షులు సీఏ రంజిత్‌కుమార్, వరంగల్ బ్రాంచ్ మాజీ అధ్యక్షులు సీఏ పీవీ నారాయణ రావు, వరంగల్ అధ్యక్షుడు సీఏ భగవాన్ దాస్ ముందాడ, కార్యదర్శి సీఏ మాదారపు సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గుప్త నిధులకోసం గొయ్యి తీస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు



గుప్తనిధుల కోసం తీసిన గొయ్యి

- మల్లూరు గుట్టపై ఘటన
- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు?

మంగపేట : మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పరిసరాల్లో గుప్త నిధుల కోసం పది మంది గల ముఠా కొంత కాలంగా తవ్వకాలు జరుపుతోంది. ఈ క్రమంలో ఆలయ పరిసరాల్లోని చింతామణి జలపాతం సమీపం దేవునికుంటలోని మైసమ్మ రాతి విగ్రహం వద్ద గురువారం కొందరు.. స్థానికుల సహకారంతో క్షుద్రపూజలు నిర్వహించి తవ్వకాలు జరుపుతున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు ఎస్సై గోదరి రవికుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. ఆలయ రికార్డ్ అసిస్టెంట్ గోనె లక్ష్మీనారాయణకు చెందిన దేవునికుంట చేనులో కొందరు తవ్వకాలు జరుపుతున్నారు. ఈవిషయం తెలుసుకుని అతడు అక్కడికెళ్లి ప్రశ్నించగా ముఠా సభ్యులు దాడికి యత్నించారు. దీంతో లక్ష్మీనారాయణ వెంటనే ఎస్సైకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఎస్సై అక్కడకు చేరుకోవడాన్ని గమనించి ముఠా సభ్యులు ద్విచక్రవాహనాలను వదిలేసి పరారయ్యారు. ఓ వ్యక్తి పట్టుబడగా అదుపులోకి తీసుకుని విచారించారు. తమను గుప్త నిధుల తవ్వకాల కోసం అటవీశాఖ అధికారి, మల్లూరుకు చెందిన శివరాత్రి వెంకన్న పిలిపించారని పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. తవ్వకాలు జరిపిన వారిలో ఇద్దరు మహిళలు, మరో 8 మంది ఉన్నట్లు సమాచారం. పోలీసులు స్వాధీనం చేసుకున్న నాలుగు ద్విచక్రవాహనాల్లో అటవీశాఖ మల్లూరు బీట్‌ఆఫీసర్ విజయరావు, మల్లూరుకు చెందిన శివరాత్రి వెంకన్నకు చెందిన రెండు ద్విచక్రవాహనాలు ఉండడం వారితో పాటు మరికొందరు స్థానికుల ఆధ్వర్యంలో గుప్త నిధుల తవ్వకాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఘటనా స్థలిలో అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసుల ఆధీనంలో మొత్తం నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై రవికుమార్‌ను వివరణ అడగగా పరారైన వారికోసం గాలిస్తున్నామని, పట్టుకున్న అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- 2 కార్లు, 11 మోటార్లు, 57 కిలోల కాపర్ వైర్ స్వాధీనం



నిందితుల అరెస్ట్‌తోపాటు స్వాధీనం చేసుకున్న మోటార్లను చూపుతున్న పోలీసులు

పరకాల: విద్యుత్ మోటార్ల చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు కార్లతోపాటు 11 మోటార్లు, రూ. 34వేల విలువైన కాపర్ వైర్, రూ.40వేల నగదు స్వాధీనం చేసుకుని ఓ బాలుడితో సహా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పరకాల పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్ల రవీందర్ వివరాలు వెల్లడించారు. పరకాల పోలీసులు నడికూడ చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లు అనుమానస్పదంగా కనిపించాయి. వాటిని తనిఖీ చేయగా వ్యవసాయ బావులకు సంబంధించిన కాపర్ వైర్ లభ్యమైంది. దీంతో కార్లలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అంతర్ జిల్లా దొంగలుగా తేలింది. హనుమకొండలోని అమరావతినగర్‌కు చెందిన మెకానిక్ బండారి అనిల్ విలాస జీవితానికి అలవాటుపడి ఓ బాలుడితోపాటు భూపాలపల్లి జిల్లా టేకుమట్లకు చెందిన మాటూరి అరవింద్, మొగుళ్లపల్లి మండలం కొరికిశాలకు చెందిన సరిగొప్పుల సాయితేజ, కమాలాపురం హరీష్‌ను మోటార్ల చోరీలకు ప్రోత్సహించాడు. దీంతో ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి మూడు నెలల నుంచి పరకాల, మొగుళ్లపల్లి, దామెర, ఇల్లంతకుంట మండలాలోని ఎస్సారెస్పీ కెనాల్ బావుల వద్ద ఉన్న మోటార్లను చోరీ చేశారు. అనంతరం మోటర్ల నుంచి కాపర్ వైర్ వేరు చేసి హుజూరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి వెళ్తుండగా నడికూడ వద్ద పట్టుబడినట్లు తెలిపారు. నిందితులు ప్రయాణిస్తున్న రెండ్లు కార్లు, నాలుగు సెల్ ఫోన్లు, 57కిలోల కాపర్ వైర్, రూ. 40వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ రవిరాజు, ఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు టి.భాస్కర్, జి.కృష్ణకుమార్, డి.దేవేందర్, డి.నాగరాజు, కె.నాగరాజు, వి.భాస్కర్, హోంగార్డు సుధాకర్, ఎం.రామన్న, పి.రవీందర్‌ను డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్‌కుమార్ అభినందించారు.

అర్హుల ఆనందహేళ..

- ఎన్పీడీసీఎల్ పరిధిలో 'గృహజ్యోతి' బిల్లు రూ.55.56 కోట్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.11.65 కోట్లు



హన్మకొండ : టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో గృహజ్యోతి ద్వారా మొదటి విడతలో 19 లక్షల 70వేల మంది రూ.55.55 కోట్ల మేర లబ్ధి పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,39,563 మంది వినియోగదారులు జీరో బిల్లుల ద్వారా రూ.11.65 కోట్ల మేర లబ్ధి పొందారు. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు చెల్లించనుంది. గృహజ్యోతి నిబంధనల ప్రకారం ప్రతి నెల 15వ తేదీలోపు బిల్లులు జారీ చేయాలి. ప్రస్తుత నెలలో జీరో బిల్లు ద్వారా రావాల్సిన మొత్తాన్ని మరుసటి నెల 20వ తేదీలోపు ప్రభుత్వానికి నివేదిక పంపాలి. ప్రభుత్వం ఈ రాయితీ మొత్తాన్ని డిస్కంకు చెల్లిస్తుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్.. తన పరిధిలో 15వ తేదీ లోపు బిల్లులు జారీ చేసింది. ప్రభుత్వానికి మరుసటి నెల వివరాలు పంపాల్సి ఉన్నప్పటికీ ఏ రోజు సమాచారం అదే రోజు పంపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో మొదటి విడతలో అర్హత సాధించిన గృహజ్యోతి సర్వీసులు 4,50,923 ఉన్నాయి. ఇందులో 4,47,729 సర్వీస్‌లకు బిల్లులు జారీ అయ్యాయి. 4,39,563 మంది విద్యుత్ వినియోగదారులు 200 లోపు యూనిట్లు విద్యుత్ వినియోగించడంతో వీరికి జీరో బిల్లులు జారీ చేశారు.

వినియోగదారుల వివరాలు.. (జీరో బిల్లు మొత్తం రూ.కోట్లలో)

జిల్లా	మొత్తం కన్జూమర్స్	గృహజ్యోతి కన్జూమర్స్	బిల్లుల జారీ	జీరో బిల్లు	జీరో బిల్లు మొత్తం
హనుమకొండ	3,45,302	1,02,156	102156	98483	3.06
వరంగల్	2,86,156	1,02,836	102804	99477	2.88
భూపాలపల్లి, ములుగు	93,257	77250	74094	75109	1.82
జనగామ	1,69,375	78655	78655	77829	1.77
మహబూబాబాద్	2,09,066	90026	90020	88665	2.11



ప్రజలను వంచించిన కేసీఆర్



మాట్లాడుతున్న జంగా రాఘవ రెడ్డి

కాజీపేట : తెలంగాణ ప్రజలు కేసీఆర్ మాయమాటలు నమ్మి పదేళ్లు అధికారం అప్పగిస్తే కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకోవడంతో పాటు అప్పుల కుప్పగా మార్చారని రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి విమర్శించారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేసి ఇంటికి పంపించారన్నారు. అయితే ఇదీ జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందడం కోసమే కాంగ్రెస్ పాలనపై ఆరోపణలు చేస్తున్నారని, ఇది మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సుంచు చంద్రయ్య, తోట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ రఘుచందర్, గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్‌యాదవ్, కూర్ల మోహన్, బైరి లింగమూర్తి, విజయ్ కుమార్, ఇమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



మోహినోద్దీన్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో చిరు వ్యాపారులను దృష్టి మరల్చి వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ వరంగల్‌లోని పుప్పాలగుట్ట చింతల్‌కు చెందిన సయ్యద్ యాకుబ్ మోహినోద్దీన్‌కు ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కిరాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. దుకాణం ఆశించిన స్థాయిలో నడవకపోవడంతో పాటు కుటుంబ అవసరాలు పెరిగాయి. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చిరు వ్యాపారులను దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గొర్రె నాగరాజు అనే వ్యక్తి దుకాణంలో రెండు రోజుల క్రితం చోరీకి పాల్పడగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి కడిపికొండ బ్రిడ్జి సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

COMMERICAL BUILDING FOR SALE

■ హన్మకొండ, సుబేదారి మెయిన్ రోడ్డులో మంచి కిరాయిలతో ఉన్న G+3 బిల్డింగ్ 355 Sq.yards గల కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును. సెల్: 9866071830, 9502267322. [W-1264952]

SERVICES

■ లీగల్ & డిటెక్టివ్ (ప్రై): సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, ప్రాపర్టీ, డివోర్స్, హై కోర్ట్, సుప్రీమ్ కోర్ట్ పెండింగ్ కేసులు Fast సెటిల్‌మెంట్ మరియు వెరిఫికేషన్ కొరకు అడ్వకేట్ AS రెడ్డి: 9676094111. [H-804912]

CHANGE OF NAME

■ I, DASARI KHANNAMBA (Old Name) Age: 69Yrs, Occu: House Wife, R/o: H.No. 27-5-159, GandhiNagar, Hasanparthy (V&M), Hanamkonda District- 506371, T.S, India have changed my name DASARI KANNAMBA (New Name). [W-1264859]

పేరు మార్చబడినది

■ నేను, దాసరి ఖన్నాంబ (పాత పేరు), వ: 69 సం॥, వృత్తి: హౌజ్ వైఫ్, అడ్రస్: ఇ.నెం. 27-5-159, గాంధీనగర్, హసన్‌పర్తి (V&M), హన్మకొండ జిల్లా- 506371, తెలంగాణ రాష్ట్రం, ఇండియా. ఇప్పుడు మారిన నాపేరు దాసరి కన్నాంబ (కొత్త పేరు). [W-1264860]

WANTED

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్: 24 గం॥ వృద్ధులకు, పేషంట్లకు, ఇంటి పని, వంట పని మరియు చిన్న పిల్లలను చూసుకోవడానికి వర్కర్లు కావలెను. సెల్: 9100116067, 9059016067. [W-1264858]

■ BS ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో పని చేయుటకు చురుకైన రిసెప్షనిస్ట్, బిజినెస్ డెవలపర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ (స్త్రీ/పు) అర్జెంటుగా కావలెను. VRS వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వబడును 7799777394. [WA-13929]

■ హన్మకొండ, హంటర్‌రోడ్‌లో ఇంటి పని చేయుటకు ఆడవారు-1, డ్రైవర్‌గా చేయుటకు మగవారు-1 కావలెను. నోట్: ఇద్దరు భార్యాభర్తలై ఉండవలెను. రూం సౌకర్యం కలదు. 9989606333, 9491474143 [WA-1264913]

■ రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ / యువకులు అర్జెంట్‌గా కావలెను. జీతం+ఇన్సెంటీవ్స్ + కమీషన్స్ ఇవ్వబడును. సంప్ర॥ 9949611060. [WA-1264911]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233892]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233895]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18K. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.